క్లుప్తంగా

యోగాతో మంచి ఆరోగ్యం



యోగాలో శిక్షణ పొందుతున్న మున్సిపల్, సచివాలయ సిబ్బంది

నర్సీపట్నం: యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యాన్ని కలిగి ఉంటామని మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర అన్నారు. ఇందుకోసం ప్రభుత్వం యోగా వారోత్సవాలను నిర్వహించిందన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని మున్సిపల్‌శాఖ ఆధ్వర్యంలో గురువారం యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విధి నిర్వహణలో ఒత్తిడిని అధిగమించడానికి, మానసిక ప్రశాంతతకు యోగా మార్గమని అన్నారు. సచివాలయ సిబ్బంది, మున్సిపల్ కార్యాలయం సిబ్బందికి యోగాసనాలపై శిక్షణ ఇచ్చారు.

కొత్తకోట దేవాలయాల షాపుల వేలం ఖరారు



వేలం పాట నిర్వహిస్తున్న ఎండోమెంట్ అధికారులు

రావికమతం : మేజర్ పంచాయితీ కొత్తకోట గ్రామంలో గల కేశవస్వామి, శ్రీ రాజరాజ లింగేశ్వర స్వామి ఆలయాలకు చెందిన అద్దె దుకాణాల వేలం పాటను యలమంచిలి ఎండోమెంట్ అధికారి ఉమాదేవి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. మూడేళ్ల కాలపరిమితికి నిర్వహించిన కేశవ స్వామి ఆలయానికి సంబంధించిన షాపును జి. అప్పారావుకు, రాజరాజ లింగేశ్వర ఆలయానికి చెందిన షాపులు సిహెచ్. ఈశ్వరరావు, బి.జయలక్ష్మి దక్కించుకున్నారని ఈవో కిరణ్మయి తెలిపారు.

ఆలయ గోపుర నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న ఆర్యవైశ్య సంఘ ఉపాధ్యక్షుడు దేవరాపల్లి శ్రీనివాసరావు

మాడుగుల : గాంధీ పార్కు వద్ద వెలసిన విజయాంజనేయ ఆలయ గోపుర నిర్మాణానికి ఆర్య వైశ్య సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు, మోదకొండమ్మ ఆలయ కమిటీ సభ్యుడు దేవరాపల్లి శ్రీనివాసరావు గురువారం రూ.30 వేలు నగదు ఆలయ నిర్వాహకుడు రాఖి శ్రీనుకు అందజేశారు. ఆలయ గోపురంతో పాటు శ్రీరామ పట్టాభిషేకం కూడా నిర్మాణం జరగడం అద్భుతమని శ్రీనివాసరావు అన్నారు. దాతలు ఆలయ నిర్మాణానికి తోడ్పాటు అందజేయాలని నిర్వాహకులు కోరారు.

ఉద్యమ్ రిజిస్ట్రేషన్ ఉచిత శిబిరం

మాడుగుల రూరల్ : స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద గల వెలుగు కార్యాలయంలో శుక్రవారం ఉద్యమ్ రిజిస్ట్రేషన్ ఉచిత శిబిరం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో కె. అప్పారావు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వ్యాపారులు, చిన్నతరహా పరిశ్రమల యజమానులు ఈ ఉద్యమ్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని పేర్కొన్నారు. వ్యాపారులు, చిన్న తరహా పరిశ్రమలకు అధికారిక గుర్తింపు, బ్యాంకు రుణ సదుపాయాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రయోజనాలు, పొందడానికి ఉద్యమ రిజిస్ట్రేషన్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆర్లిలో ఘనంగా మరిడిమాంబ పండగ



ఆర్లిలో మరిడిమాంబ అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కె.కోటపాడు : మండలంలో ఆర్లి గ్రామస్తులు మరిడిమాంబ అమ్మవారి పండగను గురువారం అత్యంత వైభవంగా జరిపారు. ఉదయం నుంచి అమ్మవారి దర్శనానికి పెద్ద సంఖ్యలో ఆలయం వద్ద భక్తులు బారులు తీరారు. మహిళలు పసుపు, కుంకుమ, చీరలను సమర్పించి మొక్కులను చెల్లించుకున్నారు. గ్రామమంతా విద్యుద్దీప అలంకరణ చేశారు. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. రాష్ట్ర వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి ఈర్లె అనురాధ, ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, సర్పంచ్ సందీప్, మాజీ సర్పంచ్ కృష్ణారావు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఎన్నికల హామీ...
నెరవేర్చరేమీ..!

- పదేళ్లుగా చాలీచాలని జీతంతో ఎంపీఈవోల విధులు
- కూటమి నేతలు హామీ ఇచ్చినా పెంపు ఊసేలేదు
- రాష్ట్రంలో 1,392 మంది ఎంపీఈవోల ఎదురుచూపు
- విశాఖ ఉమ్మడి జిల్లాల ఎంపీఈవోలకు అందని ఇన్సెంటివ్‌లు



వ్యవసాయశాఖలో పనిచేస్తున్న ఎంపీఈవోలు



పంటలపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎంపీఈవోలు

బుచ్చెయ్యపేట : వ్యవసాయశాఖలో రైతులకు అందుబాటులో ఉండి వారి ఆర్థిక స్థితిగతుల పెంపునకు నిరంతరం కృషి చేస్తున్న ఎంపీఈవో (బహుళ ప్రయోజన విస్తరణాధికారులు) అరకొర జీతాలతో అలమటిస్తున్నారు. 2014లో విధుల్లో చేరిన వీరికి 10 ఏళ్లు దాటినా ప్రభుత్వం మాత్రం జీతాలు పెంచడం లేదు. కేవలం నెలకు రూ.12 వేలు జీతంతో పని చేస్తూ కుటుంబాలతో అవస్థలు పడుతున్నారు. గత ఎన్నికల ప్రచారంలో అధికారంలోకి వస్తే జీతాలు పంచి మీ సమస్యలు పరిష్కరిస్తామన్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు,ఐటీశాఖ మంత్రి లోకేష్ ఇతర మంత్రులు హామీ ఇచ్చిన నేటికి అమలుకా లేదు. ఇదే వ్యవశాయశాఖలో వీరి తరవాత విధుల్లో చేరిన రైతు భరోసా వ్యవశాయశాఖ సిబ్బందికి మాత్రం నెలకు రూ, 33 వేలు జీతం అందస్తుండగా వీరికి మాత్రం రూ.12 వేలు ప్రభుత్వం అందిస్తుంది. వ్యవసాయశాఖలో సమానంగా పనిచేస్తున్న రైతు సేవా కేంద్రం సిబ్బందికి ఒకలా, ఎంపీఈవోలకు మరోలా జీతాలు అందించడంపై పలు గ్రామాల ఎంపీఈవోలు విచారం వ్యక్తం చేస్తున్నారు. ఉదయం నుంచి సాయింత్రం వరకు రైతులకు అందుబాటులో ఉండి పంటల సాగు విధానంతో పాటు విత్తనం నుంచి విక్రయం వరకు పలు సూచనలు,సలహాలు అందించడం, భూసార పరీక్షలు, పొలం పిలుస్తోంది, ఎరువులు, విత్తనాలు అమ్మకం, వ్యవసాయ యాంత్రీకరణ పనులు చేస్తూ నిత్యం రైతు సేవలో ఎంపీఈవోలు పని చేస్తున్నారు.

అందని ఇన్సెంటివ్‌లు..

రాష్ట్రంలో 1,392 మంది ఎంపీఈవోలు 10 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న వీరి జీతాలు పెరగక పోగా ఆర్థిక ఇబ్బందులు, అర్ధాకలి గోడు ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. విశాఖ ఉమ్మడి జిల్లాలో పని చేస్తున్న 103 మంది ఎంపీఈవోలకు రెండేళ్లుగా ప్రతి నెలా అందాల్సిన ఇన్సెంటివ్‌లు అందడం లేదు. నెలకు రూ, 3 వేలు ఇన్సెంటివ్‌లు అందక పలువురు ఎంపీఈవోలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు, లోకేష్, అచ్చింనాయుడు తదితరులను కలిసి తమ గోడు విన్నవించుకోగా



ముఖ్యమంత్రి చంద్రబాబుని కలిసి వినతి పత్రం అందిస్తున్న ఎంపీఈవోలు (ఫైల్)

అధికారంలోకి వచ్చిన వెంటనే జీతాలు పెంచుతామని హామీ ఇచ్చారు. హామీ ఇచ్చి ఏడాదైన ఎంపీఈవోల జీతాలు మాత్రం పెరగకపోవడంపై పలువురు ఎంపీఈవోలు నిరసన వ్యక్తం చేస్తున్నారు. తక్షణం ప్రభుత్వం తమకు జీతాలు పెంచి ఆదుకోవాలని కోరుతున్నారు.

పదేళ్లుగా జీతం పెరగలేదు..



పదేళ్లుగా రైతులకు అందుబాటులో ఉండి ఎంపీఈవోగా విధులు నిర్వహిస్తున్నాను. నా జీతంపైనే ఆధారపడి అమ్మ, నాన్న, చెల్లి ఉన్నారు. నెలకు రూ.12 వేల జీతంలో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం మా ఆర్థిక ఇబ్బందులు తప్పేలా జీతాలు పెంచి ఆదుకోవాలి.

–పాలమరౌట్టి సంతోష్, ఎంపీఈవో, రాజాం

మా గోడు పట్టదా..



నా జీతం మీదనే ఆధార పడి భర్త, ఇద్దరు పిల్లలు, అత్తమావలు జీవిస్తున్నాం. పిల్లలు స్కూల్ ఫీజులు, పెరిగిన నిత్యవసర వస్తువుల కొనుగోలుతో చాలీచాలని జీతంతో బతుకుతున్నాం. ప్రభుత్వం మా బాధలు పట్టించుకుని న్యాయం చేయాలి

– పి.అరుణ, ఎంపీఈవో, గున్నెంపూడి

హామీ నెరవేర్చాలి..



ఉద్యోగంలో చేరి పదేళ్లు దాటినా మాకు నెలకు రూ.12 వేలు అందిస్తున్నారు. రైతు భరోసా సిబ్బందికి రూ.33 వేలు అందిస్తున్నారు. సమాన పనికి సమాన వేతనం మాకు అందడం లేదు. ముఖ్యమంత్రి చంద్రబాబుని ఎన్నికల ప్రచారంలో కలిసి మా గోడు విన్నవించాం. ప్రభుత్వం మా ఎంపీఈవోలను ఆదుకోవాలి.

–కె.శ్రీనివాసరావు, జిల్లా ఎంపీఈవోల సంఘం ఉపాధ్యక్షుడు

ఇంటి ప్లాన్‌ల అనుమతులు సులభతరం



సమావేశంలో మాట్లాడుతున్న టౌన్ ప్లానింగ్ రీజినల్ డైరెక్టర్ పి.నాయుడు

నర్సీపట్నం : పురపాలక సంఘంలో ఇంటి ప్లాన్‌ల నిబంధనలను ప్రభుత్వం సులభతరం చేసిందని టౌన్ ప్లానింగ్ రీజినల్ డైరెక్టర్ పి.నాయుడు పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో గురువారం సచివాలయ ప్లానింగ్ సెక్రటరీలు, లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్స్‌కు సడలించిన నిబంధనలపై అవగాహన కల్పించారు. ఇరుకు ప్రాంతాల్లో కూడా సులభంగా ప్లాన్ పొందేందుకు సర్క్యులేషన్ ప్యాట్రన్ విధానాన్ని ప్రభుత్వం అమల్లోకి తీసుకువచ్చిందన్నారు. భవిష్యత్తులో రోడ్డు విస్తరణ, ఇతర అభివృద్ధి పనులు చేయడం సాధ్యం కాని ప్రాంతాల్లో మాత్రమే సర్క్యులేషన్ ప్యాట్రన్ విధానం అమల్లోకి వస్తుందన్నారు. భవనాలు, లేఅవుట్ల అనుమతులు సులభతరం చేస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేయగానే అనుమతులు వచ్చేలా ఏర్పాట్లు చేసిందన్నారు. భవన నిర్మాణ అనుమతులు సులభతరం చేసిందని ఎవరైనా అక్రమాలకు పాల్పడితే క్రిమినల్ కేసు నమోదు చేసి లైసెన్స్ రద్దు చేయడం జరుగుతుందన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి పాల్గొన్నారు. హెచ్. హనుమంతు వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

బుచ్చెయ్యపేట : మేజర్ పంచాయతీ వడ్డాదిలో విద్యుత్‌లైన్లు మరమ్మతు పనుల దృష్ట్యా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రాజు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వడ్డాది లైన్‌లో సరఫరాను నిలిపి వేస్తున్నామన్నారు. విద్యుత్ అసౌకర్యానికి ఆయా గ్రామాల ప్రజలు, వ్యాపారులు, ఉద్యోగులు, రైతులు సహకరించాలన్నారు.

నిలిచిపోయిన ఆర్టీసీ బస్సు.. ప్రయాణికుల ఇక్కట్లు



చీడిగుమ్మల ప్రాంతంలో ఆగిపోయిన ఆర్టీసీ బస్

గొలుగొండ : నర్సీపట్నం–కృష్ణదేవిపేట మార్గంలో నర్సీపట్నం ఆర్టీసీ బస్ డిపోకు చెందిన బస్ చీడిగుమ్మల వద్ద ఆగిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉదయం 10 గంటలకు నర్సీపట్నం నుంచి బయలుదేరిన ఆర్టీసీ బస్ చీడిగుమ్మల గ్రామం వద్ద ఆగిపోయింది. దీంతో 45 మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నిత్యం ఈ మార్గంలో ఆర్టీసీ సర్వీసులు ఆగిపోవడం వల్ల ప్రయాణికులు నరకయాతన పడుతున్నారు. నర్సీపట్నం నుండి వేరే బస్ రాకపోవడంతో ప్రయాణికులు ఇతర ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించారు.

ఇలా ఉంటే ...అడుగుపెట్టేదెలా?



బురదతో చిత్తడిగా మరిన బస్టాండు ఆవరణ

మాకవరపాలెం : ఆర్టీసీ బస్టాండులో అడుగు పెట్టాలంటే ప్రయాణికులు హడలిపోతున్నారు. మండల కేంద్రంలో ఉన్న బస్టాండు ప్రస్తుతం కురుస్తున్న తుపాను వర్షాలకు అధ్వానంగా మారింది. మూడు నెలల క్రితం ఈ ఆవరణకు తాత్కాలిక మరమ్మతులు చేసి వదిలేశారు. దీంతో కొద్దిపాటి వర్షం కురిసినా చిత్తడిగా మారుతోంది. చాలాకాలంగా ఇదే పరిస్థితి ఉన్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. ఫలితంగా నిత్యం ఈ స్టాండు నుంచి వివిధ ప్రాంతాలకు ప్రయాణాలు సాగించే వారంతా అవస్థలు ఎదుర్కొంటున్నారు. కొద్దిపాటి వర్షానికే చిత్తడిగా మారే ఈ స్టాండు ఆవరణ ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు అడుగు పెట్టలేని స్థితికి చేరింది. బస్సు చక్రాలు సైతం ఈ బురదలో జారిపోతున్నాయి. ఈ నేపథ్యంలో బస్టాండు ఉన్నా ప్రయాణికులు రోడ్డుపైనే బస్సులు ఎక్కాల్సి వస్తోంది. అధికారులు ఇప్పటికైనా స్పందించి ఈ స్టాండు ఆవరణకు శాశ్వత మరమ్మతులు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

నిత్య జీవితంలో యోగా భాగం కావాలి

కె.కోటపాడు : ప్రతి ఒక్కరికీ నిత్య జీవితంలో యోగా ఓ భాగం కావాలని ఎంపీడీవో సాంబశివ రావు అన్నారు. కె.కోటపాడు హైస్కూల్లో సచివాలయ సిబ్బందితో పాటు గ్రామ స్థాయిలో పలు ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న సిబ్బందికి మూడు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాలను గురువారం ఆయన పర్యవేక్షించారు. అనంతరం శిక్షణ తీసుకుంటున్న వారితో పాటు ఆయన కూడా యోగాసనాలు వేశారు. యోగా శిక్షణ తరగతులు శుక్రవారంతో ముగియనున్నట్టు తెలిపారు.

గ్రంథాలయానికి బెంచీల వితరణ



సిమెంట్ బెంచీలు వితరణ చేసిన పూర్వ విద్యార్థులు

నర్సీపట్నం : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1977–79లో ఇంటర్ చదివిన పూర్వ విద్యార్థులు శాఖ గ్రంథాలయానికి సిమెంట్ బెంచీలు వితరణ చేశారు. గ్రంథాలయానికి విచ్చేసే వారు కూర్చునేందుకు పూర్వ విద్యార్థులు చేయూతనందించారు. పూర్వ విద్యార్థులు, గొలుసు దాలయ్యనాయుడు ఆధ్యాత్మిక కేంద్రం సౌజన్యంతో బెంచీలను గ్రంథాలయ అధికారికి దమయంతికి అందజేశారు. కార్యక్రమంలో గొలుసు శ్రీనివాసరావు, రాజుబాబు, శివ సత్యనారాయణ, జి.పి.ఎస్.మూర్తి, కేతిరెడ్డి శ్రీనివాస్, పి.వి.ఆర్ మూర్తి, ప్రభాకర్ పాల్గొన్నారు.

ఘనంగా మోదమాంబ సారె ఊరేగింపు



వీరవల్లి అగ్రహారంలో సారె ఊరేగింపు



ఊరేగింపులో అమ్మవారి విగ్రహం

మాడుగుల రూరల్ : మోదమాంబ మాలదారణ భక్తులు వీరవల్లి అగ్రహారం గ్రామంలో గురువారం సారె ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు పిండివంటలు, అరటిపండ్లు, తాటికాయల గెలలు, కొబ్బరికాయలతో సారెను ఊరేగించి అమ్మవారి ఆలయానికి వెళ్లి సారె నివేదించారు. భక్తులు పెద్ద ఎత్తున సారె ఊరేగింపులో పాల్గొన్నారు.

మోదకొండమ్మ పండగకు ఏర్పాట్లు



మాడుగులలో మోదకొండమ్మ పండగకు విద్యుత్ సెట్టింగ్‌ల ఏర్పాటు

మాడుగుల : మాడుగుల మోదకొండమ్మ పండగ వచ్చే నెల 3వ తేదీన జరగనున్న సందర్భంగా మాడుగుల వీధుల్లో విద్యుత్ అలంకరణకు భారీ స్థాయిలో సెట్టింగ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. పండగలో సుమారు లక్ష మంది రానున్నారని ఆలయ కమిటీ అంచనా వేస్తుంది. దీంతో ఆ దిశగా ఆలయ కమిటీ ఏర్పాట్లు సిద్ధం చేస్తుంది.

ఉచిత కంప్యూటర్ శిక్షణకు దరఖాస్తులు

అనకాపల్లి: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు మండలంలో రేబాక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉచితంగా కంప్యూటర్ శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ ఎ.చక్రవర్తి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుకు పదో తరగతి నుంచి డిగ్రీ, డిప్లొమాలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు అర్హులన్నారు. 16 నుంచి 35 సంవత్సరాలు మధ్య వయసు వారికి రెండు నెలల పాటు శిక్షణ ఇస్తామన్నారు. ఈ నెలాఖరులోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

ప్రశ్నించే వారిపై టీడీపీ కౌన్సిలర్ల దౌర్జన్యం



మీడియాతో మాట్లాడుతున్న మున్సిపల్ వైస్‌చైర్మన్ కోనేటి రామకృష్ణ

నర్సీపట్నం : ఎదురు ప్రశ్నిస్తే సమాధానం చెప్పలేక దౌర్జన్యానికి పాల్పడుతున్నారని మున్సిపల్ వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ ప్రతినిధి, కౌన్సిలర్ మాకిరెడ్డి బుల్లిదొర పేర్కొన్నారు. సమావేశం అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. స్పీకర్ సిహెచ్.అయ్యన్నపాత్రుడు మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.20 కోట్లు తీసుకువచ్చారనడంలో వాస్తవం లేదన్నారు. వీఎంఆర్‌డీఏ నుంచి స్పీకర్ కేవలం రూ.5 కోట్లు మాత్రమే తీసుకువచ్చారన్నారు. మిగిలిన నిధులు 15వ ఆర్థిక సంఘం నిధులు అన్నారు. మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ బాక్సింగ్ రింగ్ నిర్మాణానికి నిధులు తీసుకు వస్తే కూటమి నాయకులు రింగ్ కట్టకుండా ఆపేసారని తెలిపారు. పట్టణ ప్రజల తాగునీటి అవసరాలను తీర్చేందుకు రూ.166 కోట్లు తీసుకువచ్చి, మా ప్రభుత్వంలో 50 శాతం పనులు పూర్తి చేస్తే ఈ రోజు అతీగతీ లేదన్నారు. నిధులు కేటాయింపుల్లో రాజకీయ వివక్షకు పాల్పడుతున్నారన్నారు. టీడీపీ వార్డులకే నిధులు ఇచ్చి, వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు ఉన్న వార్డులకు నిధులు ఇవ్వడం లేదన్నారు. మెయిన్ రోడ్డును తమ ప్రభుత్వంలో వంద అడుగుల మేర కొంత వరకు రోడ్డును విస్తరిస్తే కూటమి నాయకులు రోడ్డు విస్తరణను గాలికి వదిలేసారన్నారు. కొద్దిపాటి వర్షం పడితే మెయిన్ రోడ్డు ముంపునకు గురవుతుందన్నారు. స్పీకర్ కుటుంబానికి నియోజవర్గ ప్రజలు సుదీర్ఘకాలం పాటు అధికారం ఇస్తే అభివృద్ధిని గాలికి వదిలేసి, ఇప్పుడు అభివృద్ధి గురించి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వీటిన్నింటిపై కౌన్సిల్‌లో నిలదీస్తే దౌర్జన్యానికి దిగుతున్నారని అన్నారు. ఎల్లప్పుడూ ఒకే ప్రభుత్వం ఉండదన్న విషయాన్ని కూటమి కౌన్సిలర్లు గ్రహించాలన్నారు.

ఒకటో తేదీ నుంచి డిపోల్లోనే రేషన్ పంపిణీ



దేవరాపల్లిలో రేషన్ డీలర్లతో సమావేశమైన తహసీల్దార్ లక్ష్మీదేవి

దేవరాపల్లి : వచ్చే నెల ఒకటో తేదీ నుంచి రేషన్ డిపోల ద్వారా పారదర్శకంగా సరుకుల పంపిణీ చేయాలని దేవరాపల్లి తహసీల్దార్ లక్ష్మీదేవి సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం మండలంలోని రేషన్ డీలర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ఎండీయూ వాహనాలను రద్దు చేసి, చౌక ధరల దుకాణాల ద్వారా రేషన్‌ను పంపిణీ చేయాలని నిర్ణయించిన నేపథ్యంలో డీలర్లకు పలు సూచనలు చేశారు. రేషన్ డిపోల నిర్వహణలో కచ్చితంగా సమయ పాలన పాటించాలని, తూనికల్లో తేడాలు లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. కార్డులో ఒకే వ్యక్తి ఉన్న దివ్యాంగులకు, అనారోగ్యంతో మంచంపై ఉన్న వ్యక్తులకు నిర్ణీత సమయాల్లో ఇంటి వద్దకే రేషన్ అందజేయాలని సూచించారు. ప్రతి రోజు ఉదయం 8 నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు రేషన్ డిపోలు తెరిచి ఉండాలన్నారు. ప్రతి డిపోలో సరుకులు, కార్డుదారుల వివరాలతో బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. జూన్ ఒకటో తేదీన స్థానిక ప్రజాప్రతినిధులతో డిపోల్లో రేషన్ పంపిణీ ప్రక్రియను ప్రారంభించాలని సూచించారు.

రోడ్డు సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు



మేడివాడ వద్ద బీఎన్ రోడ్డుపై భారీ గొయ్యి

రావికమతం : మండల కేంద్రంలో సీపీఎం విస్తృత స్థాయి సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె. గోవిందరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది పూర్తయినా ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే చోడవరం నుంచి వెలంకాయలపాలెం వరకు రోడ్డు పనులు సంక్రాంతికి పూర్తి చేశామని అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, చోడవరం ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్ రాజు చెప్పారని, ఇప్పటికీ రోడ్డు పనులు పూర్తి చేయలేదన్నారు. విజయరామరాజుపేట, వడ్డాది బ్రిడ్జ్ పనులు చేస్తామని హామీ ఇచ్చినా నేటికీ పనులు ప్రారంభం కాలేదన్నారు. బీఎన్‌రోడ్డు పూర్తిగా గోతులు పడి చెరువులను తలపించగా, ఈ రోడ్డుపై ప్రయాణించే వాహనదారులు తరుచూ ప్రమాదాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే రోడ్డు పనులు పూర్తి చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘం మండల అధ్యక్షుడు ఎస్.వలసయ్య, సీపీఎం నాయకుడు పొంగి చంద్రయ్య, జీడిమామిడి రైతుల సంఘ నాయకుడు రాజు తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయ నిర్మాణానికి సర్పంచ్ విరాళం



ఆలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న సర్పంచ్ సంజీవిరావు

మాడుగుల రూరల్: ఎం.కోడూరు గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ముత్యాలమ్మ అమ్మవారి నూతన ఆలయం నిర్మాణానికి ఎం. కోడూరు గ్రామ సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు, ప్రభావతి దంపతులు రూ. 50వేలు విరాళంగా గురువారం ఆలయ కమిటీ చైర్మన్ రాము, కార్యదర్శి రావాల బుచ్చిబాబుకు అందజేశారు. సంజీవిరావు తల్లితండ్రులు గొల్లవిల్లి రామారావు, వరహాలమ్మ జ్ఞాపకార్థం ఈ నగదును అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు రమణబాబు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ సకాలంలో అందించండి



బుచ్చెయ్యపేటలో డీలర్లతో మాట్లాడుతున్న తహసీల్దార్ లక్ష్మి

బుచ్చెయ్యపేట : ఒకటో తేదీ నుంచి అన్ని గ్రామాల్లో ప్రజలకు నిత్యవసర వస్తువులు సకాలంలో అందేలా చూడాలని తహసీల్దార్ లక్ష్మి రేషన్ డీలర్లకు సూచించారు. గురువారం మండల కేంద్రం బుచ్చెయ్యపేటలో జరిగిన రేషన్ డీలర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ నిర్ణయం మేరకు రేషన్ సరుకులు అందించే ఎండీయులను రద్దు చేయడంతో ఇకపై రేషన్ డీలర్ల ద్వారా నిత్యవసర వస్తువులు అందించాలన్నారు. ప్రతి నెలా 1 నుంచి 15వ తేదీ వరకు ప్రతి రోజూ ఉదయం 8 నుంచి మధ్యహ్నం 12 వరకు, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు రేషన్ షాపులు తెరిచి నిత్యవసర వస్తువులు ప్రజలకు అందించాలన్నారు. ప్రతి రేషన్ షాపు వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు.

విద్యార్థులకు పద్య పఠన పోటీలు

కె.కోటపాడు : చౌడువాడ శాఖా గ్రంథాలయం వద్ద విద్యార్థులకు గురువారం పద్య పఠన పోటీలు నిర్వహించారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా వేమన శతకాలకు సంబంధించి పద్య పఠన పోటీలు నిర్వహించారు. పద్యాలతో పాటు భావాలను కూడా విద్యార్థులతో చెప్పించారు. విజేతలకు వేసవి విజ్ఞాన శిబిరాల ముగింపు రోజున బహుమతులు అందజేయడం జరుగుతుందని గ్రంథాలయాధికారి పద్మావతి తెలిపారు.